క్లుప్తంగా

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి



ఆర్మూర్‌టౌన్‌: పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారీ తులసి కుమార్‌ జాతీయ రహదారిపై వెళ్లే వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నారు. హైదరాబాద్‌, నిజామాబాద్‌, నిర్మల్‌, వరంగల్‌ దిశగా వెళ్లే జాతీయ రహదారులపై హెల్మెట్‌ లేకుండా వాహనాలపై ప్రయాణిస్తున్న యువత, రైతులకు, గ్రామీణ ప్రజలను ఆపి, ట్రాఫిక్‌ నియమాలు వివరించి హెల్మెట్‌ వినియోగంతో కలిగే లాభాలను వివరించారు. అనంతరం వారికి ఉచితంగా హెల్మెట్‌లను అందజేశారు.

వర్ని ఎంపీడీవోగా మారుతి బాధ్యతల స్వీకరణ



వర్ని: మండల అభివృద్ధి అధికారిగా మారుతి శనివారం బాధ్యతలు చేపట్టారు. వర్ని ఎంపీడీవో గా పనిచేసిన వెంకటేష్‌ సెలవు పై వెళ్లడంతో ఎంపీడీవో గా మారుతిని జిల్లా అధికారులు నియమించారు.

లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలి




పెర్కిట్‌(ఆర్మూర్‌): ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌ 21వ వార్డులో లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని మాజీ కౌన్సిలర్‌ లిక్కి శంకర్‌ ఏడీఈ శ్రీనివాస్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు. గతేడాది నుంచి లోవోల్టేజీతో వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని ఏడీఈ దృష్టికి తీసుకు వచ్చారు. దీనికి ఏడీఈ స్పందిస్తూ నెల రోజుల వ్యవధిలో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు సీహెచ్‌ నారాయణ, పీ విజయ్‌, సంతోష్‌, సతీష్‌, ప్రశాంత్‌, నవీన్‌, రమేష్‌, దత్తు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ మండల టాపర్‌కు సన్మానం



వేల్పూర్‌: ఎస్సెస్సీ ఫలితాలలో వేల్పూర్‌ మండల టాపర్‌గా నిలిచిన మోతె హైస్కూలు విద్యార్థి ఎస్‌. శ్రీనిధిని స్థానిక వీడీసీ సభ్యులు శనివారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఎస్సెస్సీలో మొత్తం 30 మంది ఉత్తీర్ణత సాధించడమే కాకుండా, అందులో సగం మంది విద్యార్థులు 500 లకు పైగా మార్కులు పొందగా, వారిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు జగదీష్‌రెడ్డి, సాయిరాం, మహేశ్‌రెడ్డి, హెచ్‌ఎం వైద్య గణేష్‌, పీఆర్‌టీయు మండల ప్రధాన కార్యదర్శి నరసింహా రావు, ఉపాధ్యాయులు మహేందర్‌, రత్నయ్య, లలితమ్మ, పాల్గొన్నారు.

నీట్‌ పరీక్ష కేంద్రం పరిశీలన



బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌లో ఏర్పాటు చేసిన నీట్‌ పరీక్షా కేంద్రాన్ని ఏసీపీ శ్రీనివాస్‌ పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు కావాల్సిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. ఆదివారం జరుగనున్న నీట్‌ పరీక్ష కోసం బోధన్‌లో ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రంలో 430 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్ష కేంద్రం పరిధిలో 144 సెక్షన్‌ ఉంటుందని వెల్లడించారు. ఏసీపీ వెంట సీఐ వెంకట నారాయణ, అధ్యాపకులు దేవిదాస్‌ లు, సిబ్బంది ఉన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

వేల్పూర్‌: మండలంలోని పడగల్‌ గ్రామంలోని కొత్త చెరువులో పడి గ్రామానికి చెందిన కంకల పెద్ద గంగాధర్‌(65) అనే వ్యక్తి మరణించినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగాధర్‌ భూములు చెరువు పక్కనే ఉండడంతో కాలకృత్యాలు తీర్చుకోడానికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మరణించినట్లు తెలుస్తోంది. శుక్రవారం సాయంత్రం నుంచి ఆయన ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల వెతికారు. గ్రామస్తులకు శనివారం చెరువు గట్టుపై చెప్పులు కనిపించడంతో చెరువులో గాలించగా, సాయంత్రం గంగాధర్‌ మృతదేహం లభించింది. వేల్పూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆర్మూర్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సమస్యల్లో ‘తల్వేద ఎత్తిపోతలు’

- శిథిలావస్థలో ఇన్‌టెక్‌ పైప్‌లైన్‌
- పనిచేయని మోటార్లు, పంపులు
- నందిపేట మండలంలో ఆయకట్టు రైతులకు అందని సాగునీరు



ఆనవాళ్లు కోల్పోయిన గోదావరి నదిలోని ఇన్‌టెక్‌ పైపులైన్‌

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండలంలోని తల్వేద గోదావరి పరివాహక ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం సమస్యలకు నిలయంగా మారింది. మండలంలోని తల్వేద, చింరాజ్‌పల్లి, లక్కంపల్లి గ్రామాలలోని సుమారు 3,500 ఎకరాలకు సాగునీరు అందివాలనే ఉద్దేశ్యంతో రూ. 8.90 కోట్లతో నిధులతో తల్వేద ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. అప్పటి విద్యాశాఖ మంత్రి మండవ వెంకటేశ్వర రావు 2003లో నీటి విడుదలను ప్రారంభించారు. అడుగడుగునా లీకేజీలు ఏర్పడుతున్నాయి. ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించిన దాఖలాలు లేవు

రైతులు సమష్టిగా రూ. 5లక్షలు ఖర్చు చేశారు..

ఎత్తిపోతల పథకం నుంచి రైతులకు సాగునీరందించడం లేదని ఉద్దేశ్యంతో గోదావరి నదిలో ఇన్‌టెక్‌ పైప్‌లైన్‌ పొడిగింపుకు 2019లో ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాంట్రాక్టర్లు నాసిరకం పైపులను వాడడంతో పైప్‌లైన్‌ పూర్తిగా చెడిపోయి లీకేజీలు ఏర్పడుతున్నాయి. అలాగే మోటార్లు పంపులుకొత్తవాటితో పాటు అవసరమైన వాటికి రిపేర్లు చేయడానికి గత ప్రభుత్వం రూ. కోటి 65 వేలు నిధులు మంజూరు చేసింది.ఇప్పటి వరకు పనులు జరగలేదు. లక్కంపల్లి గ్రామ సమీపంలో గల స్టేజ్‌ 2 వద్ద మోటారు పంపులను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. కందికుంట చెరువుకు వెళ్లే పైపులైన్‌ పగిలిపోయి మధ్యలోనే నీరు వృథాగా పోతుంది. దీంతో నీళ్లు చేరక చెరువుఎండి పోతుంది. కాలువలు సైతం శిథిలావస్థకు చేరుకున్నాయి. ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలు ఎత్తుకుపోగా రైతులు ఇటీవల రూ. 5 లక్షలు ఖర్చు చేసి తిరిగి ఏర్పాటు చేసుకున్నారు.



తల్వేద ఎత్తిపోతల పథకం మొదటి దశ పంపుహౌస్‌

అడుగడుగునా లీకేజీలు

గోదావరి ఒడ్డును ఆనుకుని ప్రారంభంలో అధికారు లు ఇన్‌టెక్‌ పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. లక్కంపల్లి, చింరాజ్‌పల్లి శివారులోని కందికుంట ప్రాంతంలో పైపులైన్‌ పూర్తిగా మూసుకుపోయింది. లక్కపల్లి శివారులో రెండో స్టేజీ ద్వారా లక్కంపల్లి, చింరాజ్‌పల్లి గ్రామాలకు చెందిన ఆయకట్టు భూములకు సాగునీరందించాలి. మోటార్లు రిపేర్లు అయి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. సాగునీరందించే పైపులైన్‌ లీకేజీలతో నీరందడం లేదు. ఆయాకట్టు గ్రామాల రైతులకు సాగునీరందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకమైన పనులు



గోదావరి నదిలో వేసిన ఇన్‌టెక్‌ పైప్‌లైన్‌ నాసిరకంగా వేయడంతో లీకేజీలు ఏర్పడి నీరు రావడం లేదు. లక్కంపల్లి శివారులో గల స్టేజీ -1 పంప్‌హౌజ్‌లో నాలుగు మోటార్లు ఉండగా ఒక మోటారు దొంగలు ఎత్తుకెళ్లారు. మూడు మోటార్లు, పంపులు తరచూ కాలిపోతున్నాయి. – సాగర్‌, రైతు, లక్కంపల్లి గ్రామం

మరమ్మతులు చేపట్టాలి



గోదావరి నదిలో వేసిన ఇన్‌టెక్‌ పైపులైన్‌లో అడుగడుగున లీకేజీలు ఉన్నాయి. లీకేజీలతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. గోదావరి నదిలో నీళ్లు ఉన్నా సాగునీరందలేని పరిస్థితి నెలకొంది. ఎత్తిపోతల పథకంలోని సమస్యలను పరిష్కరించాలి.
– మారంపల్లి నారాయణ, రైతు, తల్వేద గ్రామం

విద్యుత్‌ భద్రత సూచనలు పాటించాలి

- బోధన్‌ ట్రాన్స్‌కో ఏడీ మహమ్మద్‌ ముక్తార్‌



మాట్లాడుతున్న ఏడీ ముక్తార్‌

రుద్రూర్‌: విద్యుత్‌ ప్రమాదాల నివారణకు భద్రత సూచనలు పాటించాలని బోధన్‌ ట్రాన్స్‌కో ఏడీ మహమ్మద్‌ ముక్తార్‌ సూచించారు. విద్యుత్‌ భద్రత వారోత్సవాల్లో భాగంగా శనివారం రుద్రూర్‌ మండల కేంద్రంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. విద్యుత్‌ భద్రత , పొదుపు సూచనలతో కూడిన కరపత్రాలు, వాల్‌ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏడీ మాట్లాడుతూ...విద్యుత్‌ ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పశువులు టాన్స్‌ఫార్మర్‌, ఎర్త్‌ పైపుల దగ్గరకు వెళ్లకుండా కాపరులు జాగ్రత్త వహించాలని కోరారు. విద్యుత్‌ అంతరాయానికి సంబంధించిన సమస్యలు ఉంటే టోల్‌ ఫ్రీ నంబర్‌ 1912కు కాల్‌చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. రుద్రూర్‌ ట్రాన్స్‌కో ఏడీఈ నగేష్‌కుమార్‌, వివిధ మండలాల ట్రాన్స్‌కో ఏఈలు శ్రీనివాస్‌, బుజ్జిబాబు, గోపి, సబ్‌ ఇంజినీర్‌లు, విద్యుత్‌ సిబ్బంది పాల్గొన్నారు.

అంబంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న బోధన్‌ సబ్‌కలెక్టర్‌ వికాస్‌ మహతో

ఎడపల్లి(బోధన్‌): మండలంలోని అంబం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ వికాత్‌ మహతో శనివారం పరిశీలించారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణం త్వరలో పూర్తి అయ్యేలా చూడాలని ఎంపీడీవో, సెక్రెటరీని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్‌, సెక్రటరీ శ్రీనివాస్‌లు ఉన్నారు.



బస్సాపూర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

ఇందిరమ్మ ఇళ్ల కోసం సర్వే..

బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్‌, మెండోరా మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం అధికారులు సర్వేను నిర్వహించారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అర్హులా కాదా అనే అంశాన్ని ధ్రువీకరించుటకు సర్వేను చేపడుతున్నట్లు పంచాయతీ రాజ్‌ ఏఈఈ షరీఫ్‌ తెలిపారు. వారి వెంట ఇందిరమ్మ కమిటీల సభ్యులు తదితరులున్నారు.

నేడు స్వర్ణామృత ప్రాసన పంపిణీ

నందిపేట్‌(ఆర్మూర్‌): మండల కేంద్రానికి సమీపంలోని శ్రీ కేదారీశ్వర ఆశ్రమంలో పదిహేను సంవత్సరాల వయస్సు లోపు పిల్లలకు స్వర్ణామృత ప్రాసన పంపిణీ చేయబడుతుందని ఆశ్రమ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సకాలంలో వచ్చి చిన్నారులకు మందు వేయించుకోవాలి కోరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినయ్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న నందిపేట వీడీసీ సభ్యులు

నందిపేట్‌(ఆర్మూర్‌): నందిపేట మండల కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆర్మూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలోని ప్రధాన రోడ్డు సెంట్రల్‌ లైటింగ్‌కు నిధులు మంజూరు చేయించాలని కోరారు. అలాగే కంటకట్ట శ్మశాన వాటికకు కాంపౌండ్‌వాల్‌, స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు, ఉర్దూ కళాశాల ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్‌, వీడీసీ సభ్యులు దమ్మాయి సుధాకర్‌, ఎర్రం మురళి, మచ్చర్ల సాగర్‌, సాంబారు నారాయణ, మచ్చర్ల సాయన్న, ఎర్రం సుబ్బ ముత్యం, మంతెన శ్రీనివాస్‌, బుడ్డ చిన్నయ్య, మచ్చర్ల శ్రీను, నాగుల అశోక్‌, ఎర్రం సాగర్‌, ఏశాల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చెట్లను తొలగింపజేసిన యువకులు



చెట్లను తొలగింపజేస్తున్న యువకులు

మాక్లూర్‌: మండలంలో గొట్టిముక్కల నుంచి మెట్టు గ్రామానికి వెళ్లే దారిలో మూలమలుపు వద్ద ఉన్న చెట్లను గొట్టిముక్కల యువకులు శనివారం తొలగింపజేశారు. ఇటీవల ఈమూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ మహిళా ప్రాణాలు కోల్పోయింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కన్పించకుండా ఉన్న చెట్ల పొదలను కిలోమీటరు పొడవున జేసీబీతో తొలిగించారు. ట్రాక్టర్లతో తెచ్చిన మొరం మట్టిని పోసి అక్కడ ఉన్న ప్రమాదకరమైన మలుపును వాహనదారులు గుర్తించేలా చేశారు. గొట్టిముక్కల గ్రామానికి చెందిన మోతే రాజేశ్వర్‌, దారం ప్రవీణ్‌, వై రత్నాకుమార్‌, ముప్పడి ఓంకార్‌, మేకల దత్తు, సొంతే మల్లేష్‌, ఆదే దీపక్‌లు సొంత డబ్బులతో నివారణ చర్యలు చేపట్టారు. వీరిని పలువురు వాహనదారులు అభినందించారు.

సీసీ రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదే



రెంజర్లలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న సునీల్‌రెడ్డి

బాల్కొండ: గ్రామాల్లో సీసీ రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలదేనని కాంగ్రెస్‌ పార్టీ బాల్కొండ నియోజక వర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. శనివారం ముప్కాల్‌ మండలం రెంజర్ల గ్రామంలో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతుందన్నారు. సీసీ రోడ్లపై కేజీవీల్స్‌ తీసుకెళ్లి ధ్వంసం చేసుకోవద్దన్నారు. నాయకులు పాలెం చిన్నారెడ్డి, గంగాశేషాద్రి, మల్లారెడ్డి, ఆకుల పెద్ద రాజన్న, హేమంత్‌, నవీన్‌, రమేశ్‌ తదితరులున్నారు.


కాకతీయ కాలువలో వ్యర్థాలు



కాకతీయ కాలువలో పేరుకు పోయిన వ్యర్థాలు

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ నుంచి నీటి సరాఫరా చేసే కాకతీయ కాలువలో మాంసం వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో నీరు మొత్తం కలుషితమవడంతో పాటు, కాలువలో నీటిలో వ్యర్థాలు ఒకే చోటా చేరాయి. శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌నుంచి కాకతీయ కాలువ ఆయకట్టు రైతుల ప్రయోజనాలు కాపాడుట కోసం నిరంతరం కాలువలో నీటిని నిల్వ ఉంచుతారు. ప్రస్తుతం కూడ అలానే నిల్వ ఉంచారు. కాని వ్యర్థాలతో నీరు కంపు కొడుతుంది. నీటిపై పూర్తిగా వ్యర్థాలు తేలియాడుతున్నాయి. నీరు కలుషితం కాకుండ చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

బాల్కొండ: ముప్కాల్‌ మండల కేంద్రంలో శుక్రవారం దేవి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం రెండో రోజు యజ్ఞం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రుద్రూర్‌: మండలంలోని రుద్రూర్‌, రాయకూర్‌ క్యాంపులో శనివారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌ రెడ్డి పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మండల కేంద్రంలోని మాజీ వైస్‌ ఎంపీపీ నట్కరి సాయిలు, జహీరాబాద్‌ పార్లమెంట్‌ యూత్‌ కాంగ్రెస్‌ మాజీ కార్యదర్శి మాశెట్టి శ్రీనివాస్‌, రాయకూర్‌ క్యాంపులో విండో చైర్మన్‌ సంఘమేశ్వర్‌ రావ్‌ ఇళ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాయకూర్‌ విండో వైస్‌ చైర్మన్‌,మండల కాంగ్రెస్‌ అధ్యక్షుడు అరుణ్‌ కుమార్‌ , రుద్రూర్‌ విండో చైర్మన్‌ సంజీవరెడ్డి, మాజీ జెడ్పీటీసీ నరోజి గంగారాం తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం

- లారీల కోసం రాత్రింబవళ్లు ఎదురుచూపులు
- డొంకేశ్వర్‌ మండలంలో ఇబ్బందులు పడుతున్న రైతులు



దత్తాపూర్‌లో ధాన్యం కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): చేతికందిన పంటను అమ్ముకోవడానికి రైతులు అగచాట్లు పడుతున్నారు. పక్షం రోజులైనా కల్లాల నుంచి వడ్ల కుప్పలు కదలకపోవడంతో రాత్రింబవళ్లు కావలి కాస్తున్నారు. లారీల కోసం ఎండలో నిరీక్షిస్తున్నారు. మండలంలో కుద్వాన్‌పూర్‌ సొసైటీ పరిధిలో తొండాకూర్‌, దత్తాపూర్‌, మారంపల్లి, గంగాసముందర్‌ గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. దత్తాపూర్‌, తొండాకూర్‌, మారంపల్లి గ్రామాల్లో పదిహేను రోజులుగా లారీలు రాక తూకం వేసిన బస్తాలు అలాగే ఉన్నాయి. ఆకొనుగోలు కేంద్రాల్లో సుమారు 2 వేల నుంచి మూడు వేల బస్తాలు పేరుకుపోయాయి. దీంతో రైతులు నింపిన ధాన్యం బస్తాలపై టార్పాలిన్లు కప్పి ఉంచారు. వర్షం, దొంగల భయానికి రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం బస్తాలను ఎందుకు మిల్లులకు తరలించడం లేదని రైతులు సొసైటీ నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానం చెప్తున్నారని ఆరోపించారు. లారీలు లేవని చేతులెత్తేస్తున్నారని చెప్తున్నారు.

వెయిట్‌లాస్‌ పేరుతో దోపిడీ..

దత్తాపూర్‌లో మూడ్‌ లక్ష్మణ్‌కు చెందిన 584 బస్తాలు తూకం వేసి లారీలో ఓ రైస్‌ మిల్లుకు పంపించారు. అక్కడికి వెళ్లిన తర్వాత వెయిట్‌లాస్‌ పేరుతో రెండు బస్తాల ధాన్యాన్ని తక్కువ చేసి రికార్డు చేశారు. కనీసం రైతుకు సమాచారం లేకుండా రైస్‌ మిల్లరు, సొసైటీ వాళ్లు దాదాపు 85 కిలోల ధాన్యాన్ని తరుగు తీశారు. తనకు అన్యాయం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అలాగే బస్తాకు రూపాయి చొప్పున లారీ డ్రైవర్లు వసూలు చేస్తున్నారని, అధికారులు దీనిపై చర్యలు తీసుకోవాలని కోరాడు.

పట్టించుకోవడం లేదు



ధాన్యం తీసుకొచ్చిన పదిహేను రోజుల తర్వాత నా నంబర్‌ రావడంతో మూడు రోజుల క్రితం తూకం వేశారు. కానీ, తూకం వేసిన బస్తాలను రైస్‌ మిల్లుకు తరలించడం లేదు. రాత్రింబవళ్లు కాపలా ఉంటున్న. సొసైటీ వాళ్ల దగ్గరికి పోతే వాళ్లు పట్టించుకోవడం లేదు. – జిల్ల రాజన్న, దత్తాపూర్‌

తరుగు తీస్తారనే భయం ఉంది



ధాన్యం తీసుకొచ్చి మూడు వారాలవుతుంది. తూకం వేసిన బస్తాలు లారీలు రాక ఎండలో అట్లనే ఉంటున్నాయి. వర్షం భయానికి పట్టాలు కప్పి ఉంచినం. ఇంకా రెండొద్దులు ఇట్లనే ఉంచితే మిల్లుకు పోయిన తర్వాత వెయిట్‌ లాస్‌ అని చెప్పి ఎంత తరుగు తీస్తారనే భయం ఉంది. – కంచు ముత్తెన్న, దత్తాపూర్‌

ఇష్టారాజ్యంగా కొనుగోళ్లు

రెంజల్‌(బోధన్‌): రెంజల్‌ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లలో సిబ్బంది ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని రైతులు ఆరోపించారు. సొసైటీలో పని చేస్తున్న కిషోర్‌ అనే వ్యక్తి రైతులతో దురుసుగా ప్రవరిస్తున్నట్లు పేర్కొంటున్నారు. శనివారం రెంజల్‌కు చెందిన గైని మహేందర్‌ అనే రైతు కిషోర్‌పై బోధన్‌ సబ్‌ కలెక్టర్‌ ఫిర్యాదు చేశారు. పారదర్శకత పాటించడంలేదని ప్రశ్నిస్తే అసభ్యంగా మాట్లాడుతున్నడని ఫిర్యాదులో పేర్కొన్నారు. అతని పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అక్రమాలను ఫిర్యాదులో వివరించాడు.

ఈఆర్‌ ఫౌండేషన్‌ ఆర్థిక సహాయం

ఆర్మూర్‌టౌన్‌: పట్టణంలో ఈఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఇద్దరికి ఆర్థిక సహాయం అందించారు. 18వ వార్డులో ఆర్థిక పరిస్థితి బాగలేక ఇబ్బందులు పడుతున్న ఒకరికి రూ. 5వేలు, అలాగే 29 వార్డు కమలా నెహ్రూ కాలనీలో తల్లిదండ్రులను కోల్పోయి చెల్లెల్ని పోషిస్తున్న షేక్‌రాయిస్‌కు రూ. 5వేలు ఆర్థిక సహాయాన్ని ఈఆర్‌ ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు ఈరవత్రి రాజశేఖర్‌ అందజేశారు. కార్యాక్రమంలో ఫౌండేషన్‌ సభ్యులు సురేష్‌, సడక్‌ ప్రమోద్‌, రాంప్రసాద్‌, సురేందర్‌ తదితరులున్నారు.

ధాన్యం సేకరణను వేగవంతం చేయాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

వేల్పూర్‌: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర కార్యదర్శి నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. శనివారం ఆయన వేల్పూర్‌ క్రాస్‌రోడ్డు వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం తూకం వేయడంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో హమాలీలు తక్కువగా ఉండడం వల్ల ధాన్యం తొందరగా తూకం కావడం లేదన్నారు. సుమారు 60 మంది రైతులు తమ ధాన్యం తూకం కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. అకాల వర్షం కురిస్తే ఎండిన ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇక్కడే కాకుండా జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల 15 నుంచి 20 రోజులు దాటినా ధాన్యం తూకం వేయడం లేదని జిల్లా అదనపు కలెక్టర్‌, సివిల్‌ సప్లయి జిల్లా మేనేజరుతో ఫోన్‌లో మాట్లాడారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని వెంటనే ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు.

సినిమాలు

పీవీఆర్‌ మల్టీప్లెక్స్‌ (ఆర్మూర్‌)

స్క్రీన్‌-1	రైడ్‌-2(హిందీ)-10.00, 1.00, 7.25, 10.25, రెట్రో-4.00
స్క్రీన్‌-2	హిట్‌-12.30, 3.45, 7.00, 10.15
స్క్రీన్‌-3	రెట్రో-11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్‌-4	హిట్‌-11.30, 2.45, 6.00, 9.15

మాంసం ధరలు (రూ..)

చికెన్‌	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్‌	190
		లైవ్‌	160
స్కిన్‌లెస్‌	220	మటన్‌	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్‌	97,200	వెండి(కిలో)	1,00,000
22 క్యారెట్స్‌	89,725		

– నిజామాబాద్‌ బిజినెస్‌

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు



కొటార్మూర్‌లో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు

పెర్కిట్‌(ఆర్మూర్‌): ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆర్మూర్‌ తహసీల్దార్‌ సత్యనారాయణ హెచ్చరించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ పరిధిలోని కొటార్మూర్‌ 220 సర్వే నెంబరులో గల ప్రభుత్వ భూమిని ఒకరు చదును చేసి నిర్మాణ పనులు చేపట్టాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ సత్య నారాయణ, ఆర్‌ఐలు దశరథ్‌, ప్రమోద్‌ శనివారం భూమి వద్దకు వెళ్లి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.